# కథ 'చెప్పు'మా?

నాలుగు రోజుల సెలవు తరువాత బ్యాంక్‌కి రావడం-కొంచెం విసుగ్గానే వుంది నాకు! అయితే టేబుల్ మీద వున్న పెళ్ళి శుభలేఖ చూడగానే నా ఆనందానికి అంతు లేదు! మా జనరల్ మేనేజర్ మురళీమోహన్‌రావుగారి అమ్మాయి పెళ్ళి- అదీ తిరుపతిలో! ఎప్పుడూ బ్యాంక్ గురించి తప్ప ఏదీ ఆలోచించని మురళీమోహన్‌రావుగారు అమ్మాయి పెళ్ళి తలపెట్టడం ఆయన శిష్యులకి స్వంత ఇంట్లో పెళ్ళయినంత ఆనందం!

పెళ్ళి శనివారం పొద్దున్న 11.30కి- అలివేలు మంగాపురం కళ్యాణ మంటపంలో!

''మీకే ఫోన్'' రెండోసారి చెప్పడమేమో- సుమన్ గారు గట్టిగానే అన్నారు.

కడ్‌తాల్ నుంచి లక్ష్మీపతి... ''ఏంటోయ్ రెండుసార్లు ఫోన్ చేశాను- లేవుట- మీ నల్లకుంట బ్రాంచ్‌కి సోమవారం సెలవుకదా- అందుకే ఇప్పుడు ఇంటి నుంచి చేస్తున్నా- బ్యాంక్ పనిలో పడితే మళ్ళీ మర్చిపోతానేమోనని!''

''మా బావమరిది అమ్మాయి బారసాలకి రాజమండ్రి వెళ్ళాను. ఇది తెలుసా- మురళీ మోహన్ రావుగారి అమ్మాయి పెళ్ళట తిరుపతిలో...'' నేనింకా ఏదో చెప్పబోతూండగానే అడ్డుపడ్డాడు లక్ష్మీపతి. ''అందుకే నేనూ ఫోన్ చేస్తూంట- నారాయణాద్రిలో శుక్రవారానికి చేయించు రిజర్వేషన్! తిరుగు ప్రయాణం ఆదివారానికి- ఆ ఏడుకొండలవాడిని కూడా దర్శించుకోవాలిగా!''

''అలాగే- ఈ రోజే సాయంత్రం కాచిగూడ స్టేషన్‌కి...'' పని అయిపోయిందని కాబోలు ఫోన్ పెట్టేశాడు లక్ష్మీపతి.


తిరిగి నా సీట్‌కి వచ్చేస్తూంటే ఫోన్ మోగింది మళ్ళీ!

మారేడ్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ సత్తయ్యగారు... ''కాముడూ, హమ్మయ్య- వచ్చేశావా? తిరుపతికి నీకూ, నాకూ, లక్ష్మీపతికి రిజర్వ్ చేయించు- టికెట్లు! సరదాగా పాతరోజులు గుర్తుచేసుకుంటూ వెళ్ళొద్దాం!''

సత్తయ్యగారూ, నేనూ, లక్ష్మీపతి ఆర్.పి రోడ్ బ్రాంచ్‌లో మురళీమోహన్‌రావుగారి దగ్గర పనిచేసిన వాళ్ళం! మా ముగ్గురికీ మంచి దోస్తీ! మురళీ మోహన్‌రావుగారు మా ముగ్గురినీ ఎంతో అభిమానంగా చూసేవారు! అప్పుడు ఆయన ఆర్.పి.రోడ్ బ్రాంచ్ ఇన్‌ఛార్జ్‌గా వుండేవారు!

''ఆ విషయమే లక్ష్మీపతితో ఇప్పుడే మాట్లాడాను. అలాగే చేయిస్తాను'' ఆ సంగతీ ఈ సంగతీ మాట్లాడి ఫోన్ పెట్టేశాను నేను.

శుక్రవారం సాయంత్రం లక్ష్మీపతి కడ్‌తాల్ నుంచి డైరెక్ట్‌గా మా ఇంటికి వచ్చేశాడు. మా బ్రాంచ్ నాలుగింటిదాకా కాబట్టి ఐదింటికల్లా నేనింట్లో వున్నా. ఇద్దరం సికింద్రాబాద్ స్టేషన్ చేరుకొనేసరికి, ప్లాట్‌ఫాం మీద సత్తయ్యగారు మాకోసం ఎదురు చూస్తున్నారు. అవును మరి, ఆయన టికెట్ కూడా నా దగ్గరే కదా వుంది!



''బయట స్వాతీ టిఫిన్స్ నుంచి ఏమయినా కట్టించుకు రానా?'' అన్నారాయన టెన్షన్ తగ్గడంతో.

మా ఆవిడ ముందే చెప్పింది- ముగ్గురికీ తనే ఏదయినా చేసిస్తానని! పాతిక పూరీలు, దద్దోజనం ప్యాక్ చేసిచ్చింది- అదే చెప్పాను!

మాచిరాజు కామేశ్వరరావు

రైలు కదలడానికి ఐదు నిముషాల టైం వుండగా స్పెషల్ ఎనౌన్స్‌మెంట్- సారాంశం. ''ఎస్-1 కోచ్ పొరపాటున రైలుకి తగిలించలేదట. దానిని ఇప్పుడు రైలు చిట్టచివరి బోగీకి తగిలిస్తారట!''

కాసేపట్లోనే కాందిశీకుల్లా కుటుంబాలకి కుటుంబాలు, నెత్తిన సామానులతో, పిల్లాజెల్లాతో ఇంజన్ చివర దగ్గర నుంచి ఇరవై కోచ్‌లు దాటుకుంటూ రైలు ఆ చివరికి వెళ్ళడం కనిపించి ప్రాణం ఉస్సూరుమంది! రైల్వే వాళ్ళ నిర్లక్ష్యం వల్ల డెబ్బైమంది శిక్ష అనుభవిస్తున్నారు. రైలు కదలడం అరగంట లేట్ కావడంతో పరోక్షంగా అందరం బాధితులమే!

రైలు కదిలే ముందు పరిగెత్తుకుంటూ వచ్చి మా కోచ్‌లోకి ఎక్కారు రఘురామయ్యగారు! ఆయన ఎమ్.జి.రోడ్ బ్రాంచ్ మేనేజర్! మమ్మల్ని చూడగానే ఆయన మొహం చాటంత అయింది.

''నాకు రిజర్వేషన్ లేదు'' నా పక్కన కూలబడుతూ అన్నారాయన!

''ఫరవాలేదు- మా ముగ్గురికీ వుంది. అడ్జస్ట్ చేసుకుందాం...'' అన్నాన్నేను.

''ముందే ఎందుకు రిజర్వ్ చేసుకోలేదు?''

అన్ని పనులూ పద్ధతి ప్రకారం చేసుకొనే లక్ష్మీపతికి కొద్దిగా కోపం వచ్చినట్లుంది. తను ఆరడుగులుంటాడు. బెర్త్ తనకే సరిపోదు.

''మేం సర్దుకుంటాంలె!'' నవ్వేశారు సత్తయ్యగారు.

రఘురామయ్యగారు భలే సరదాగా మాట్లాడతారు. బ్యాంక్ విషయాలు, సినిమాలు, రాజకీయాలూ, జోక్స్ ఏమయినా చెప్పి నవ్వించగలరు! మాకు రైలు నల్గొండ చేరడం తెలియనే లేదు.

''పాలీష్...పాలీష్...సార్ బూట్ పాలీష్ చేయమంటారా?'' అంటూ పన్నెండేళ్ళ కుర్రాడు భుజాన సంచితో మాకు అడ్డంగా నిలబడ్డాడు.

ఎవరికి వాళ్ళం బూట్లు చూసుకున్నాం! పెళ్ళికి బయలుదేరుతూ ఎవరం మాత్రం పాలీష్ చేయించుకోకుండా వుంటాం? అందరం బయలుదేరే ముందు చేయించుకున్న వాళ్ళమే!

''వద్దురా- ఇంతకీ పాలీష్ చేయడానికి ఎంత తీసుకుంటావ్?'' అడిగాను నేను.

''రోజుకెంత సంపాదిస్తావురా?'' సత్తయ్యగారు.

''అసలు నువ్వు టికెట్ కొన్నావా?'' లక్ష్మీపతి అనుమానం.

''వాడిని పెళ్ళి పాలీష్ చేసుకుని నాలుగు డబ్బులు సంపాదించుకోనీయండి. కబుర్లు మనకి కాలక్షేపం

కావొచ్చు కానీ- వాడి కడుపునిండవు'' అ ప్పించుకున్నారు రఘురామయ్యగారు.

పాలీష్ కుర్రాడు ''పాలీష్...పాలీష్...'' అని అరుస్తూ మమ్మల్ని దాటుకుని వెళ్ళిపోయాడు!

''వీడిని చూస్తూంటే పాతికేళ్ళ క్రితం మన కెనరా బ్యాంక్ వాళ్ళమంతా బోగీ మొత్తం రిజర్వ్ చేసుకుని బెంగుళూరు యూనియన్ కాన్ఫరెన్సుకి వెళ్ళడం గుర్తుకు వస్తోంది'' అన్నారు రఘురామయ్య. ''ఇప్పుడు మీరింకా చెడ్డీల్లోనే వుండి వుంటారు'' అన్నారు మళ్ళీ ఆయనే!

''పాతికేళ్ళ క్రితం సంగతి గుర్తుకు వచ్చిందంటే ఆ రోజు ఏదో కథ జరిగే వుంటుంది'' అన్నాను నేను ఆసక్తిగా!

''కథ చెప్పు మా- మామా- ఆ కథ చెప్పుమా?'' రాగయుక్తంగా అన్నారు సత్తయ్యగారు.

లక్ష్మీపతి కథలు చదవకపోయినా వింటాడు, అందుకే సీట్‌లో సర్దుకు కూర్చున్నాడు.

రఘురామయ్యగారు నా వాటర్ బాటిల్‌లో నీళ్ళొంపుకు తాగి, ఆ కథ చెప్పడం ఆరంభించారు.

''ఆరోజు బోగీ బోగీ అంతా మన కెనరా బ్యాంక్ వాళ్ళమే! అందరం పాతిక, ముప్పై ఏళ్ళ మధ్యలో వున్న కుర్రాళ్ళం! బోగీ అంతా పాటలతో, డాన్సలతో, కబుర్లతో, పేకాటలతో మహా కోలాహలంగా వుంది! నేను పేకాటలో వున్నాను. అప్పుడొక బూట్ పాలిష్ చేసే కుర్రాడు మా కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చాడు. బ్యాంక్‌వాళ్ళం కదా- సహజంగానే ఎక్కువమందికి బూట్లున్నాయి! అన్ని జతల బూట్లు చూసి కాబోలు కుర్రాడి కళ్ళు చమక్కున మెరిశాయి. వాడికి పదమూడేళ్ళుండొచ్చు. బతికి చెడిన కుటుంబంలా వుంది. కుర్రాడు పీలగా వున్నా ఎర్రగా, నీట్‌గా వున్నాడు.

''సార్- పాలీష్'' వాడు క్రింద కూర్చుని సంచీలోంచి పాలిష్ డబ్బాలు, బ్రష్‌లూ బయటకు తీశాడు.

''ఎంత తీసుకుంటావురా పాలీష్‌కి'' మాలో ఒకడు.

''పావలా సార్!''

''రోజుకెంత సంపాదిస్తావ్?''

''ఐదో పదో!''

''డబ్బులేం చేస్తావు- సినిమాలు చూసేస్తావా?'' మరొకడు పళ్ళు బయట పెట్టాడు.

''నెలకి రెండు మూడు చూస్తాను- డబ్బు మా అమ్మకి ఇచ్చేస్తాను!''

కాలక్షేపానికి మాలో అందరూ వాడిని తలో ప్రశ్నా వేయడం ఆరంభించారు.

''నువ్వు నీ డబ్బు ఇవ్వడం దేనికీ! మీ నాన్న సంపాదించడా?''

''మున్సిపల్ ఆఫీస్‌లో వుద్యోగం పోయింది. ఇప్పుడు రిక్షా తొక్కుతాడు. అమ్మకి డబ్బు ఇవ్వడు పైగా అమ్మని కొట్టి ఇంట్లో డబ్బు తీసుకుపోతాడు''

''మరి మీ అమ్మేం చేస్తుంది?''

''పాచి పని- నాలుగిళ్ళలో చేస్తుంది. అమ్మకి దగ్గు, ఇంకా ఎక్కువ ఇళ్ళలో చేయలేదు!''

''అందుకని అందరికీ సరిపడా సద్దన్నం తేగలదుగా? ఇంకా ఎందుకురా మీకు డబ్బు?''

''మా అక్క పెళ్ళికి దాచాలిగా...?''

''మీ అక్క వయసెంతరా?''


''పిలా తెల్లగా వుంటుందా?''

''హైదరాబాద్ తీసుకురా- ఎక్కడయినా వుద్యోగం చూస్తాం!''

తన అక్కను గురించి అందరూ తలో మాటా మాట్లాడటం నచ్చినట్లు లేదు. వాడు మొహం ఎర్రజేసుకుని, ''బూట్లు ఇప్పిస్తే పాలీష్ చేస్తాను సార్!'' అన్నాడు.

పాలీష్ మాకొద్దంటే మాకొద్దంటూ ఎవరికి వాళ్ళం కాళ్ళని బెర్తుల కిందికి తోసేసుకున్నాం.

శౌరి మాత్రం తన బూట్లు పాలీష్ చేయమన్నాడు...''క్రీం బాగా పుయ్యి, బూట్లు అద్దంలా మెరవాలి''




పావుగంట సేపు శ్రద్ధగా నానా తంటాలు పడి మట్టిగొట్టుకు పోయివున్న శౌరి సొట్టబూట్లకి మంచి మెరుపే తెప్పించాడు ఆ కుర్రాడు.

బూట్లలో కాళ్ళు పెట్టుకుంటూ, పైజేబులోంచి పది పైసల బిళ్ళ తీసి, కుర్రాడి మీదకి గిరవాటు వేశాడు శౌరి.

బెర్త్‌క్రిందికి దొర్లిపోయిన నాణాన్ని తడిగా, చెత్తగా వున్న ఆ క్రింద అంతా తడిమి తీసుకున్నాడు ఆ కుర్రాడు. ''పాలీష్‌కి పావలా అని చెప్పాను కదా సార్!''

''ఇంకా నయం- నీ బోడి పాలీష్‌కి ఇంతకన్నా ఎవడిస్తాడు? మీ అక్కనొచ్చి చేయమను పది రూపాయలిస్తాను!''

శౌరి మాటలకి అంతా ఘొల్లుమన్నారు!

పాలీష్ కుర్రాడి కళ్ళలో తడి!

కంపార్ట్‌మెంట్‌లో ఆరేడుమంది వాడిచేత బూట్‌పాలీష్ చేయించుకున్నారు. అయితే శౌరి చెప్పడంతో ఎవరూ పదిపైసల కన్నా ఎక్కువ ఇచ్చిన పాపాన పోలేదు- పైగా వాడి అక్కను గురించి వెకిలిగా కామెంట్లు!

వికారాబాద్‌లో రైలాగినపుడు ఆ కుర్రాడు దిగిపోయాడు.

ఆ రాత్రి పేకాటలు, మందులు అయ్యే సరికి అర్ధరాత్రి దాటింది! ఎవరికీ ఒంటిమీద స్పృహలేదు! రైలు బెంగుళూరు చేరాకే అందరికీ మళ్ళీ మెలుకు వచ్చింది!

హడావిడిగా అందరం లేచి పక్క బట్టలు సర్దుకున్నాం!

''నా చెప్పులేవీ?'' రాధా కృష్ణ

''నా బూట్లు కనిపించడం లేదు'' శౌరి కేక.

అప్పుడు చూసుకున్నాను-నా బూట్లూ కనిపించడం లేదు!

మొత్తం కంపార్ట్‌మెంట్‌లో అందరి బూట్లూ, చెప్పులూ మాయం!

''ఇది ఆ పాలీష్ కుర్రాడి పనే!'' పళ్ళుకొరికాడు శౌరి.

బూట్లు లేవని, టక్కులు- టైలూ పీకేసుకున్నారు కొందరు! పగిలిన కాళ్ళతో, ఆనెకాయలతో నడవలేని వాళ్ళు కొందరు!

డెబ్భైమందికి పైగా చెప్పులు లేకుండా రైలు దిగడం చూసి ఆశ్చర్యపోయారు ఫ్లాట్‌ఫాం మీదున్న వాళ్ళు!

అందరం బిలబిలమంటూ స్టేషన్ బయటకొచ్చి, దగ్గరలో ఉన్న చెప్పుల షాపు అరుగుల మీద కూర్చున్నాం! ఒక గంట పడిగాపులు పడ్డాక, తాపీగా వొచ్చి తలుపు తెరిచాడు చెప్పుల షాపువాడు. ఎవరి తాహతును బట్టి వాళ్ళం హవాయ్ చెప్పులు, ఆకు చెప్పులు, బూట్లు వగైరాలు కొనుక్కుని, బ్రతుకు జీవుడా అనుకుంటూ షాప్‌లోంచి బయటకొచ్చాం!

అది మా బెంగుళూరు ప్రయాణంలో చెప్పుల కథ'' అంటూ ముగించారు రఘురామయ్యగారు!''

''నేను కెనరా బ్యాంక్ ఇంటర్వ్యూకి వస్తున్నప్పుడు నా బ్రౌన్‌షూస్ రైల్లోనే పోయాయి!'' అన్నాడు లక్ష్మీపతి.

''పాతికేళ్ళ క్రితం బెంగుళూరు రైల్లో నా చెప్పులు పోయాక కొన్ని వందల ప్రయాణాలు చేశాను- పెళ్ళిళ్ళు చూశాను- గుళ్ళకి వెళ్ళాను. మళ్ళీ ఎప్పుడూ నా చెప్పులు పోలేదు- అందుకో ఐడియా వుంది!'' అన్నారు రఘురామయ్యగారు.

''ఏవిటది?'' ఒకేసారి అడిగాం శ్రోతలం ముగ్గురం.

''రాత్రి చెబుతాను. ముందు ఆత్మారాముడిని శాంతింపచేయండి'' అన్నారాయన పొట్ట తడుముకుంటూ!

అందరం పూరీలూ, దద్యోజనం లాగించేశాం.

పదింటికి లైటాఫ్ చేసేముందు, ఓ బూటుని కూర్చున్న బెర్త్‌కిందికి, మరో బూటుని ఎదురు బెర్త్ కిందికి తోసేస్తూ-''ఇదన్నమాట ఆ ఐడియా! పెళ్ళిళ్ళలోగానీ, గుళ్ళలోగానీ, ప్రయాణాల్లోగానీ ఇలా చెప్పుల చింత వదిలి ప్రశాంతంగా వుండాలంటే ఇలా జతలు విడదీసి చెరోచోట పెట్టడమే!'' అన్నారు రఘురామయ్యగారు.

ఓ జంటని కలపడానికి తిరుపతి వెళ్తున్న మేం చెప్పుల జతల్ని వేరుచేసి, ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయాం!

★